సాక్షి తిరుపతి

శుక్రవారం । 8 । ఆగస్టు । 2025



కల్తీ..కల్తీ

ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల శాఖాధికారులు తిరుపతిలోని రెస్టారెంట్లపై గురువారం దాడులు చేశారు. - 8లో



పాలకూట విషం

గాంధీపురం పంచాయతీలోని డెయిరీ నుంచి వచ్చే వ్యర్థ జలాల కాలుష్యంతో ఆ ప్రాంతంలో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. - 8లో



అంగన్‌వాడీ పనితీరు భేష్

రేణిగుంట మండలం విప్పమానుపట్టెడలోని అంగన్‌వాడీ పనితీరు భేష్ అని ఫుడ్ కమిషనర్ గంజిమల దేవి కితాబిచ్చారు. - 8లో

● వరలక్ష్మీ వ్రతానికి వేళాయె!



తిరుపతి జిల్లాలో వరలక్ష్మీ వ్రతానికి సర్వం సిద్ధమైంది. వివిధ ఆలయాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. పూజకు కావాల్సిన సామగ్రిని కొనుగోలు చేసేందుకు ప్రజలు పట్టణాలకు తరలివచ్చారు. తిరుపతి నగరం కొనుగోలుదారులతో కిక్కిరిసింది.


– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



కర్ర తూకాలతో ధాన్యం కొనుగోలు చేస్తున్న వ్యాపారులు

రైతుకు 1010 కష్టాలు

అప్పు కోసం అన్నదాత ఆలి మెడలోని తాళి బొట్టు తాకట్టు పెట్టి.. చెమట చుక్కలు నీరుగా పారించి వరి పంట సాగు చేశాడు. కష్టాన్ని రంగరించి పంట ఒడ్డుకు తెచ్చుకున్నాడు. కళ్లాలు ధాన్యపురాశులతో కళకళలాడుతున్నాయి. చేసిన అప్పులు కళ్ల ముందు కదలాడుతున్నాయి. మద్దతు ధరకు సర్కారు ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆశ పడ్డాడు. అయితే కూటమి సర్కారు కర్షకుడిని గాలికి వదిలేసింది. దీంతో ధాన్యం కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. జిల్లాలో ఎంటీయూ1010 ధాన్యానికి మద్దతు ధర చాయలే ఎక్కడా కనిపించడం లేదు. ఫలితంగా దేశానికి పట్టెడన్నం పెట్టే కర్షకులు దళారుల కబంధ హస్తాల్లో చిక్కి విలవిల్లాడుతున్నారు. గిట్టుబాటు ధర దక్కక పుడమి పుత్రులకు నష్టాలు, కష్టాలే మిగులుతున్నాయి.



దళారుల దయకొదిలేసింది..!

- ఎంటీయూ 1010 ధాన్యం కొనుగోలుపై సర్కారు చిన్నచూపు
- నెమ్ము పేరుతో బస్తాకు 5 కిలోలు నొక్కుడు
- విలవిల్లాడుతున్న అన్నదాత

పెళ్లకూరు: జిల్లాలో ఈ ఖరీఫ్‌లో 80 వేల ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇందులో 50 వేల ఎకరాల్లో 1010 వరి రకం సాగులో ఉంది. అయితే ఈ రకానికి డిమాండ్ లేదని కొనుగోలుదారులు, వ్యాపారులు చేతులెత్తేస్తున్నారు. మరో వైపు వ్యవసాయ శాఖ అధికారులు ఖరీఫ్ సీజన్‌లో తాము ధాన్యం కొనుగోలు చేయడం లేదని చెబుతున్నారు. రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

ముమ్మరంగా కోతలు

ఆరుగాలం కష్టపడి పండించిన వరిపైర్లు కోత దశకు రావడంతో ప్రస్తుతం రైతులు ముమ్మరంగా వరి నూర్పిడి పనులు చేస్తున్నారు. అయితే పండించిన ధాన్యానికి మద్దతు ధర లేకపోవడం, ఎంటీయూ 1010 రకం ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి లేనందున గిట్టుబాటు లేక అన్నదాతలు అల్లాడుతున్నారు. కొందరు గిట్టుబాటు ధర లేకపోవడంతో రోడ్లపైన, కళ్లాల్లో ధాన్యం ఆరబెడుతున్నారు. గత జగనన్న ప్రభుత్వంతో పోలిస్తే ఈఏడాది ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ కూలీల రేట్లు పెరగడంతో ఎకరం సాగుకు గతంలో రూ.25 వేలు పెట్టుబడులు ఉండగా ప్రస్తుతం రూ.35 వేలుకు చేరుకుంది. పెళ్లకూరు, చెంబేడు, చిల్లకూరు, పునబాక, నెలబల్లి, కలవకూరు, చావలి, నందిమాల తదితర గ్రామాల్లో వరి కోతలు జోరుగా సాగుతున్నాయి. అయితే రైతులు చెమటోడ్చి పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పించకుండా దళారులు రైతులను దోచుకుంటున్నారు. రైతులు వ్యవసాయానికి చేసిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో ధాన్యం కళ్లాల్లోనే తక్కువ ధరలకు దళారులకు విక్రయిస్తుండడం గమనార్హం.

తవుడు కన్నా ధాన్యం ధర తక్కువ

రైతులు పండించిన ధాన్యానికి కూటమి ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో ఎంటీయూ 1010 రకం 80 కిలోల బస్తాపై 5 కిలోలు నెమ్ము తొలగించి, కేవలం రూ.1,370కి దళారులు కొనుగోలు చేస్తున్నారు. కాగా 80 కిలోల తవుడు (వరి పొట్టు) ధర రూ.2,160కు పాడి రైతులు కొనుగోలు చేసుకుంటున్నారు. రైతులు పెట్టుబడులు పెట్టి కష్టపడి పండించిన ధాన్యం ధర కంటే తవుడుకు గిరాకీ ఎక్కువగా ఉండడం విశేషం. గత జగనన్న ప్రభుత్వంలో ఎంటీయూ-1010, ఎన్ఎల్ఆర్-145, ఆర్ఎన్ఆర్ఎం-7, ఎన్ఎల్ఆర్ 34449, బీపీటీ-5240, ఎన్ఎల్ఆర్-33358, ఎన్ఎల్ఆర్ 33057 ధాన్యాలను గ్రేడ్-ఏ రకంగా గుర్తించి క్వింటాల్ రూ.2,350 మద్దతు ధర ప్రకటించారు. అలాగే ఎంటీయూ-1001, సీఆర్-1009, ఎన్ఎల్ఆర్-34242, ఏడీటీ-37, ఎన్ఎల్ఆర్- 286000 రకాలను సాధారణ రకంగా గుర్తించి క్వింటాల్ రూ.2,300 మద్దతు ధర ప్రకటించారు. కానీ కూటమి ప్రభుత్వంలో ఎంటీయూ1010కి గి ట్టుబాటు ధరపై ఎలాంటి ప్రకటన వెలువడకపోవడం గమనార్హం. రైతులను ఆదుకుంటాం, నాణ్యత లేని ధాన్యాన్ని కూడా కొనుగోలు చేసి అన్నదాతలను ఆదుకుంటామని చెప్పిన సీఎం చంద్రబాబు అబద్ధాలకు ఇది మరో నిదర్శనం.



పెళ్లకూరులో వరి కోత కోస్తున్న యంత్రం

ఎంటీయూ 1010 రకానికి మద్దతు ధర కల్పించాలి



కష్టపడి పండించిన ఎంటీయూ 1010 రకం ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి దళారులు స్వాహా చేయకుండా కొనుగోలు చేయాలి. కష్టపడి పండించిన ధాన్యం తక్కువ ధరకే విక్రయించడంతో నష్టాలు వస్తున్నాయి.

-పరంధామనాయుడు, లక్ష్మీనాయుడుకండ్రిగ

దళారులకే విక్రయిస్తున్నాం



రైతులు పండించిన ధాన్యం అధికారులు కొనుగోలు చేయకపోవడం, గిట్టుబాటు ధర ప్రకటించకపోవడం వల్ల చివరికి తక్కువ ధరలకు దళారులకే విక్రయాలు చేస్తున్నాము. ఈఏడాది ధాన్యం ఆరబెట్టుకోవడానికి కనీసం టార్పాలిన్ పట్టలు కూడా పంపిణీ చేయడం లేదు.

-సుబ్రమణ్యంనాయుడు, యాలకారికండ్రిగ

పౌరసరఫరాల శాఖ అధికారులకు విన్నవించాం

వాతావరణ పరిస్థితుల ఆధారంగా పలు ప్రాంతాల్లో ఎక్కువ మంది రైతులు ఎంటీయూ1010 రకం వరి సాగు చేశారు. కానీ సన్నరకం వరి సాగు మాత్రమే చేయాలని ప్రభుత్వం సూచించింది. ప్రస్తుతం అన్ని ప్రాంతాల్లో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎంటీయూ1010 రకం ధాన్యం కొనుగోలు విషయమై పౌరసరఫరాలశాఖ అధికారులకు విన్నవించాం.

-నాగార్జున సాగర్, ఏడీ, వ్యవసాయశాఖ, నాయుడుపేట డివిజన్

న్యూస్‌రీల్

జిల్లా అధికారులతో సమీక్షలు



సమీక్షకు వర్చువల్ పద్ధతిలో హాజరైన కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: జిల్లా అధికారులతో రాష్ట్ర స్థాయి అధికారులు గురువారం పలు అంశాలపై వర్చువల్ పద్ధతిలో సమీక్షించారు. తిరుపతి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ పాల్గొన్నారు. ప్రధానంగా ఏపీఐఐసీకి చెందిన సమస్యలపై చర్చించారు. అలాగే స్వర్ణాంధ్ర, పీ-4, చిన్న, మధ్యతరహా పరిశ్రమల స్థాపన, ప్రధాన ప్రాజెక్టులు, భూ సమస్యలు, జిల్లా దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు, అన్నదాత సుఖీభవ, యూరియా కొరత తదితర అంశాలపై చర్చించారు. జిల్లా పరిస్థితులను కలెక్టర్, జేసీ వారికి వివరించారు. అడ్మిషన్ల సమయం మరింత పెంచాలని, సర్టిఫికెట్లు ఇప్పటికీ కొందరికి అందలేదని సమన్వయకర్తలు అధికారులకు విన్నవించారు. రాష్ట్ర ఓపెన్ స్కూల్స్ సొసైటీ సమన్వయకర్త నరసింహారావు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ గురుస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'నవోదయ' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి 9, 11వ తరగతులలో మిగిలి ఉన్న సీట్ల భర్తీ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ కేవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఏదేని ప్రభుత్వ పాఠశాలలో 8వ తరగతి చదివి 2011 మే 1వ తేదీ, 2013 జూలై 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులని తెలియజేశారు. అలాగే 11వ తరగతిలో ప్రవేశాల కోసం ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివి 2009 జూన్ 1వ తేదీ, 2011 జూలై 31 మధ్య జన్మించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత రలిగిన విద్యార్థులు నవోదయ విద్యాలయ వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 23వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష వచ్చే ఏడాది ఫిబ్రవరి 7న నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

రైల్వే ప్రయాణికుల భద్రతే లక్ష్యం



తిరుపతి రైల్వేస్టేషన్ తనిఖీ చేస్తున్న ఆర్పీఎఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్

తిరుపతి అన్నమయ్యసర్కిల్: రైల్వే ఆస్తుల రక్షణతో పాటు ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) పనిచేయాల్సి ఉంటుందని దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ పేర్కొన్నారు. తిరుపతి పర్యటనలో భాగంగా గురువారం ప్రధాన రైల్వేస్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ప్రధానంగా ఆయా స్టేషన్లలో స్థానిక పోలీసుల సహకారంతో ఆర్పీఎఫ్ అధికారులు నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నూతనంగా నిర్మాణంలో ఉన్న భవనంలోని భద్రతా ప్రణాళికపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. రైల్వే స్టేషన్‌లో సీసీ టీవీ పర్యవేక్షణ వ్యవస్థ, బ్యాగేజ్ స్కానర్లు, మెటల్ డిటెక్టర్లు వంటి ఆధునిక భద్రతా పరికరాల ఆవశ్యకతపై చర్చించారు. అనంతరం రేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో పనిచేస్తున్న గవర్నమెంట్ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గుంతకల్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాష్‌కుమార్ జైస్వాల్, రేణిగుంట అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ రాజగోపాలరెడ్డి, ఆర్పీఎఫ్ సీఐలు సందీప్‌కుమార్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

13న ఖాళీ ప్లాస్టిక్ టిన్ల ఈ వేలం

తిరుపతి అన్నమయ్యసర్కిల్: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో జీడిపప్పు ప్యాకింగ్‌కు వినియోగించిన ఖాళీ ప్లాస్టిక్ టిన్లు ఈనెల 13వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ వేలం వేయనున్నారు. ఈ మేరకు గురువారం టీటీడీ ముఖ్య ప్రజా సంబంధాల అధికారి పత్రికా ప్రకటన విడుదల చేశారు. మరిన్ని వివరాల కోసం తిరుపతిలోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877-2264429 నంబరులో కార్యాలయం వేళల్లో, లేదా టీటీడీ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై దాడి హేయం



జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు (ఇన్‌సెట్) పూలేకు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తిరుపతి మంగళం: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ గుండాలు దాడి చేయడం హేయమైన చర్య అని తిరుపతి కార్పొరేషన్ మేయర్ శిరీష్ అన్నారు. ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై జరిగిన దాడిని ఖండిస్తూ గురువారం తిరుపతి బాలాజీకాలనీలోని జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద మేయర్ శిరీషతోపాటు వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేయర్ శిరీష మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజాసంక్షేమాన్ని, ప్రజలకు ఇచ్చిన హామీలను పక్కన పెట్టి వైఎస్సార్‌సీపీ నాయకులే లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్షలతో కూటమి నాయకులు దాడులకు పాల్పడడం రెడ్‌బుక్ రాజ్యాంగానికి నిదర్శనమన్నారు. ఏడాదిన్నర కాలంగా కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతూ వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడుతూ, అక్రమ కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపుతున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు మేలు చేసి ఉంటే ఎన్నికలకు భయపడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ నాయీ బ్రాహ్మణ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తొండమల్ల పుల్లయ్య, తిరుపతి రూరల్ మాజీ ఎంపీపీ చిలమంద మునికృష్ణ, చిన్ని యాదవ్ మాట్లాడారు. బీసీ వర్గానికి చెందిన రమేష్ యాదవ్‌పై దాడి చేయడం అమానుషమన్నారు. రాజకీయం అంటే ప్రజాబలంతో గెలవాలే తప్ప దాడులు చేసి జనాలను భయభ్రాంతులకు గురిచేసి తద్వారా ఎన్నికల్లో గెలవాలనుకోవడం దుర్మార్గపు చర్యే అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు లడ్డు భాస్కర్‌రెడ్డి, కోటూరు ఆంజనేయులు, టౌన్‌బ్యాంక్ వైస్ చైర్మెన్ వాసుయాదవ్, తిరుపతి రూరల్ వైస్ ఎంపీపీ మాధవరెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లు కూల్చివేతే అభివృద్ధా..?



ఇళ్లను కూల్చి వేస్తున్న జేసీబీ

- కూటమి ప్రభుత్వం పేదలపై కక్ష
- పేదలకు చెందిన 77 ఇళ్లు నేలమట్టం
- జేసీబీకి అడ్డుగా కూర్చున్న బాధితులు
- పోలీసుల బందోబస్తుతో ఇళ్లు కూల్చివేత

రేణిగుంట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అభివృద్ధి మాట పక్కన పెట్టి, పేదల ఇళ్లు కూల్చివేతే అజెండాగా ముందుకు సాగుతోంది. గత ప్రభుత్వంలో ఇళ్లు నిర్మించుకోవడమే పేదలు చేసుకున్న నేరంగా పరిగణించి, ఎటువంటి ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా పచ్చ నాయకులు చెప్పిందే వేదంగా రెవెన్యూ అధికారులు ఇళ్లు కూల్చివేస్తున్నారు. అందులో భాగంగా రేణిగుంట మండలంలో వారం రోజుల వ్యవధిలో గత ప్రభుత్వంలో పేదలు నిర్మించుకున్న 100 ఇళ్లకు పైగా నేలమట్టం చేశారు. రేణిగుంట మండలంలోని జీ పాళెం పంచాయతీ పద్మానగర్‌లో గత ప్రభుత్వంలో 77 మంది పేదలు నిర్మించుకున్న రేకుల ఇళ్లను ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా గురువారం తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ఐ జయ కృష్ణ, వీఆర్వోలు, పోలీసుల బందోబస్తు నడుమ జేసీబీలతో కూల్చి వేయించారు. ఎక్కడెక్కడో కూలి పనులు చేసుకుంటున్న బాధితులు ఇళ్లు కూల్చివేస్తున్నారన్న సమాచారం తెలుసుకుని నివాసాల వద్దకు చేరుకుని రెవెన్యూ అధికారులను ఎంత బతిమాలినా వారు తమ పని తాము చేసుకుని వెళ్లిపోయారు.

జేసీబీకి అడ్డుగా కూర్చున్న బాధితులు

తమ ఇళ్లను కూల్చివేస్తున్నారన్న సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న బాధితులు జేసీబీకి అడ్డుగా కూర్చున్నారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ అప్పుచేసి కట్టుకున్న ఇళ్లను కూల్చివేస్తే ఊరుకోమని భీష్మించుకున్నారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు బాధితులను ఇలా చేస్తే మీపై కేసులు నమోదు చేయాల్సి వస్తుందని బెదిరించి వాళ్లను అడ్డు తప్పించి, ఇళ్లు కూల్చివేశారు.



తహసీల్దార్‌కి తమ గోడును వెళ్లబోస్తున్న బాధితులు



జేసీబీకి అడ్డుకుంటున్న మహిళ


వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించుకోవడమే నేరమా?



గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే సూచనల మేరకు రెవెన్యూ అధికారులు మాకు స్థలం ఇచ్చారు. అప్పు చేసి రేకుల ఇల్లు వేసుకున్నాం. కానీ సదుపాయాలు లేకపోవడంతో కాపురం ఉండకుండా బాడుగ ఇంట్లో ఉంటున్నాం. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా మా ఇల్లు కూల్చివేశారు.

-అమ్ములు బాధితురాలు పద్మ నగర్, రేణిగుంట


మాకు చావే శరణ్యం



అప్పు చేసి కట్టుకున్న ఇల్లును నేలమట్టం చేశారు. కనీసం మాకు ముందుగా చెప్పి ఉంటే ఇంట్లో పనికొచ్చే సామాన్లను తీసుకొని ఉండేవాళ్లం. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా ఇలా కూల్చివేయడం దారుణంగా ఉంది. ఇప్పుడు ఇల్లు లేదు అప్పు మాత్రం మిగిలింది ఇక మాకు చావే శరణ్యంగా మిగిలింది.

– రమ్య, బాధితురాలు పద్మా నగర్, రేణిగుంట

ప్రజా అవసరాల కోసమే



పద్మానగర్‌లోని లేఅవుట్‌కు సంబంధించి ప్రజా ప్రయోజనాల కోసం వదిలిన స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ముందస్తు నోటీసులు ఇచ్చి అక్రమ నిర్మాణాలను కూల్చి వేశాం. పాఠశాల, పార్కు వంటి సదుపాయాల కోసం పంచాయతీకి స్థలాన్ని స్వాధీనం చేస్తున్నాం.

– చంద్రశేఖర్ రెడ్డి, తహసీల్దార్ రేణిగుంట

తిరుపతిలో రెడ్‌బుక్ రాజ్యాంగం

- భూమన కుటుంబంపై బురద జల్లేందుకు కుట్రలు
- వ్యక్తిగత కారణాలతోనే పవన్‌పై జనసేన నేత దినేష్ దాడి



జనసేన నాయకుడు దినేష్‌ను అరెస్ట్ చేయాలంటూ ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తిరుపతి మంగళం: టీడీపీ కార్యకర్త.. జనసేన నాయకుడి మధ్య వ్యక్తిగత కక్షల కారణంగా జరిగిన దాడిని అడ్డు పెట్టుకుని వైఎస్సార్ సీపీ నాయకుడిని అరెస్టు చేయడంతో తిరుపతిలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందన్న విషయం తేటతెల్లమైంది. వివరాల్లోకి వెళితే.. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేరు చెప్పుకుని పలువురిని మోసగిస్తున్న పవన్ అనే వ్యక్తికి జనసేన పార్టీకి చెందిన దినేష్ (అలియాస్ సెటిల్‌మెంట్ దినేష్)కు మధ్య విభేదాలున్నాయి. కాగా వైఎస్సార్‌సీపీ నేత అనీల్‌రెడ్డి బైక్‌లను అద్దెకు ఇచ్చే వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో పవన్, అనీల్‌రెడ్డి వద్ద ఓ బైక్‌ను ఏడాది కిందట అద్దెకు తీసుకెళ్లి, ఇవ్వలేదు. దీనిపై అనీల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో బుధవారం పవన్ బైక్ ధరను చెల్లిస్తానని చెప్పడానికి అనీల్ కార్యాలయానికి వచ్చాడు. ఈ విషయం తెలుసుకున్న దినేష్ అక్కడికి వెళ్లి పవన్‌పై విచక్షణారహితంగా దాడి చేశాడు. ఇదే అదునుగా భావించిన కూటమి నేతలు అనీల్‌రెడ్డి పవన్‌పై దాడి చేశాడంటూ సోషల్‌మీడియాలో వైరల్ చేసి, పోలీసు కేసు పెట్టి అరెస్టు చేయించారు. ఈ విషయమై అనీల్‌రెడ్డి భార్య మాట్లాడుతూ తమ వద్ద బైక్ అద్దెకు తీసుకెళ్లి ఏడాదిగా తిరిగి తెచ్చి ఇవ్వకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని దీంతో పవన్ పోలీసు కేసులొద్దు బైక్ ఎంత అవుతుందో చెల్లిస్తానని, కూర్చుని మాట్లాడుకుందామని తమ కార్యాలయానికి వచ్చారని తెలిపారు. ఈ విషయం జనసేన పార్టీ దినేష్ తెలుసుకుని వచ్చి పవన్‌పై విచక్షణరహితంగా దాడి చేశారని ఆమె తెలిపారు. అంతే తప్ప అతనిపై తన భర్త అనీల్‌రెడ్డి దాడి చేయలేదని, వారు చేసే దాడిని ఆపేందుకు ప్రయత్నించారన్నారు.

అనీల్‌రెడ్డి నన్ను కొట్టలేదు

వైఎస్సార్‌సీపీ నేత అనీల్‌రెడ్డి తనని కొట్టలేదని జనసేన నాయకుడు దినేష్ చేతిలో తీవ్రంగా గాయపడిన బాధితుడు పవన్ వీడియో ద్వారా తెలిపాడు. అనిల్ దగ్గర తాను, నంద్యాలకు చెందిన మహేష్ అనే వ్యక్తి ఇద్దరం బైక్ అద్దెకి తీసుకున్నామని, మహేష్ అనే వ్యక్తితో కలిసి కొన్ని తప్పులు చేసిన విషయం వాస్తవమేనన్నారు. అందుకే మా అన్న దినేష్ నన్ను కొట్టాడని.. అంతే తప్ప అనీల్‌రెడ్డి కొట్టలేదని తెలిపాడు. కొందరు రాజకీయ లబ్ధి కోసం తన వీడియోలను సోషల్ మీడియాలో పెట్టి వైరల్ చేస్తున్నారని, వెంటనే వాటిని తొలగించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బాధితుడు పవన్ వెల్లడించాడు.

ఈస్ట్ పోలీసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు

పవన్‌పై దాడి చేసిన జనసేన నాయకుడు దినేష్‌ను అరెస్టు చేసి, తమ పార్టీ నేత అనీల్‌రెడ్డిని విడిచి పెట్టాలని వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు మల్లం రవిచంద్రారెడ్డి, పార్టీ యువజన విభాగం నాయకులు ఉదయ్‌వంశీ, మల్లం రవికుమార్‌రెడ్డి, దినేష్ రాయల్, పసుపులేటి సురేష్, రమణారెడ్డితోపాటు పార్టీ శ్రేణులు డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన దినేష్‌ను వెంటనే అరెస్టు చేసి చర్యలు తీసుకోవాలని ఈస్ట్ పోలీసులకు వైఎస్సార్‌సీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దాడి చేసిన వారిని వదిలి పెట్టి బైక్ అద్దెకు ఇచ్చి నష్టపోయిన అనీల్‌రెడ్డిపై కేసులు పెట్టడం ఏమిటని పోలీసులను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు.

భూమన కుటుంబంపై బురద జల్లేందుకు కుట్రలు

కూటమి ప్రభుత్వ వ్యతిరేక విధానాలను చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు భూమన కరుణాకరరెడ్డి, తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి నిత్యం ఎండగడుతున్నారు. ఈ విషయాన్ని జీర్ణించుకోలేక భూమన కుటుంబంపై బురదజల్లేందుకు కూటమి నాయకులు జనసేన, టీడీపీ నాయకులు చేసిన దాడిని వైఎస్సార్‌సీపీకి, భూమన కుటుంబానికి ఆపాదిస్తూ కూటమి సోషల్ మీడియాల్లో వైరల్ చేయడమే ఇందుకు నిదర్శనం.



పవన్‌ను కాలుతో తన్నుతున్న జనసేన నాయకుడు దినేష్



జనసేన పార్టీ ట్యాగ్ వేసుకుని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కార్యక్రమంలో పాల్గొన్న దినేష్

క్లుప్తంగా

ఇంజనీరింగ్ ఉద్యోగాలకు 37,121 దరఖాస్తులు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: టీటీడీ ఇంజనీరింగ్ విభాగంలోని 57 ఉద్యోగాలకు సంబంధించి 37,121 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరందరికి ప్రశ్నపత్రం ద్వారా పరీక్షలు నిర్వహించి నియామకాలు చేపట్టే దిశగా చర్యలు తీసుకోనున్నారు. అదేవిధంగా టీటీడీలోని కీలక విభాగాల్లోని ఖాళీలను భర్తీ చేసే విషయంలో రెగ్యులర్, తాత్కలిక డెప్యూటేషన్ పద్ధతిపై ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనికి సంబంధించి ప్రత్యేకంగా నియమించిన కమిటీ సమర్పించిన నివేదిక ద్వారా ఖాళీల భర్తీ ప్రక్రియ చేపట్టనున్నారు. స్విమ్స్ ఆస్పత్రిలో 128 మంది పారామెడికల్ సిబ్బందితో పాటు రిజిస్ట్రార్, ఇతర విభాగాల అధికారుల నియామకానికి టీటీడీ అధికార యంత్రాంగం నిర్ణయించింది.

అంగన్‌వాడీ పనితీరు భేష్

రేణిగుంట: మండలంలోని విప్పమాను పట్టెడ పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం రాష్ట్ర ఫుడ్ కమిషనర్ గంజిమల దేవి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆహార పదార్థాలు, బాలామృతం, పిల్లలు హాజరు పట్టికను తనిఖీ చేశారు. చిన్నపిల్లల తల్లులు, గర్భిణులు, పిల్లలతో ముఖాముఖీ నిర్వహించారు. వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. అంగన్‌వాడి కేంద్రం అభివృద్ధిపై సంతృప్తి వ్యక్తం చేసి సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డిని అభినందించారు. ఇలాంటి మోడల్ అంగన్‌వాడీ సెంటర్‌ను రాష్ట్రంలోనే మొదటిసారి చూశానని ఇలాంటి సౌకర్యాలున్న కేంద్రం అంగన్‌వాడీ పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు చాలా సౌకర్యవంతంగా ఉంటుందని కొనియాడారు. అనంతరం పక్కనే ఉన్న పాఠశాలల సందర్శించి పిల్లలతో మమేకమై చర్చించి, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి, సీడీపీఓ కృష్ణవేణి, వైద్యశాఖ సూపర్‌వైజర్ కామరాజు, అంగన్‌వాడీ కార్యకర్త కోకిల, వెల్ఫేర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

కంటైనర్ దగ్ధం



రేణిగుంట: మండలంలోని మర్రిగుంట కూడలిలో గురువారం తెల్లవారుజామున కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. ఆపై అగ్నికి ఆహుతయ్యింది. ఈ ఘటనలో సుమారు పది లక్షల రూపాయల విలువ చేసే వస్తువులు కాలిబూడిదయ్యాయి. గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ కథనం మేరకు.. శ్రీసిటీ నుంచి బెంగళూరుకు వివిధ రకాల వస్తువులతో వెళ్తున్న కంటైనర్ అదుపుతప్పి బోల్తా పడింది. అదే సమయంలో వ్యవసాయ మార్కెట్ సిబ్బందికి చెందిన ద్విచక్ర వాహనం పై కంటైనర్ పడడంతో రెండు వాహనాలు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు.

సెప్టెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్



మూడో అదనపు జిల్లా జడ్జి గురునాథ్

తిరుపతి లీగల్: రాష్ట్ర న్యాయ సేవా సంస్థ ఆదేశాల మేరకు తిరుపతిలో సెప్టెంబర్ 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ ఎం.గురునాథ్ గురువారం మీడియాకు తెలిపారు. ఇందులో భాగంగా ఈనెల 18వ తేదీ నుంచి తిరుపతిలో ప్రతి కోర్టులో ప్రీ లోక్ అదాలత్ సిటింగ్‌లను నిర్వహించనున్నట్టు న్యాయమూర్తి పేర్కొన్నారు. ఆయా కోర్టుల న్యాయమూర్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని, కేసులను రాజీ చేస్తారని తెలిపారు.

ఆకుపచ్చని రంగులో కాలకూటాన్ని తలపించేలా డెయిరీ నుంచి వస్తున్న వ్యర్థ జలాలు.. అందులో కరిగి మిళితమైన అత్యంత ప్రమాదకరమైన రసాయనాలు.. అవి భూమిలో ఇంకి కలుషితమవుతున్న భూగర్భజలాలు.. ఆ వ్యర్థ జలాల నిల్వల్లో వృద్ధి చెందుతున్న దోమలు.. ఆ నీటి నుంచి వస్తున్న దుర్వాసనతో ఆ ప్రాంతంలోని నివాసితులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత్యంతరం లేక ఆ పాల కూట విషం తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు.



మదర్ డెయిరీ ప్రాంగణంలో వదిలేసిన వ్యర్థ జలాలు

పాలకూట విషం

- డెయిరీ ప్రాంగణంలో వదిలేస్తున్న ప్రమాదకర వ్యర్థ జలాలు
- భూగర్భంలోకి ఇంకుతుండడంతో జలకాలుష్యం
- నోటీసులిచ్చినా మారని యాజమాన్యం తీరు

తిరుపతి రూరల్ : గాంధీపురంలోని డెయిరీ నుంచి వచ్చే వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదిలేస్తుండడంతో సమీపంలో నివసించే జనం కాలుష్యం కోరల్లో చిక్కుకుని విలవిలాడుతున్నారు. ఫ్యాక్టరీకి చుట్టూ నివాసముంటున్న వారు దుర్గంధాన్ని భరించలేకపోతున్నారు. వ్యర్థ జలాలను వదలకూడదని పలుసార్లు అధికారులు హెచ్చరికలు జారీ చేసినా.. నోటీసులు ఇచ్చినా ఆ డెయిరీ యాజమాన్యంలో మాత్రం మార్పు రావడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. కాలుష్య నియంత్రమండలి అధికారులైనా స్పందించాలని స్థానికంగా నివాసముంటున్న ప్రజలు కోరుతున్నారు. తిరుపతి రూరల్ మండలం గాంధీపురం పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న మదర్ డెయిరీ నుంచి వచ్చే వ్యర్థాలతో కూడిన మురుగునీరు ప్రహరీ గోడ పగిలిన ప్రాంతంలో బయటకు వస్తుండడంతో పలుసార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఆ ప్రహరీ నుంచి వెలుపలకు వ్యర్థ జలాలు రాకుండా డెయిరీ లోపల రాళ్లు, మట్టితో నింపేసింది. కొద్దిరోజుల పాటు డెయిరీ ప్రాంగణంలో కూ డా వ్యర్థ జలాలు వదలకుండా ఉండేది. ఇటీవల వర్షాలు వచ్చినప్పటి నుంచి మళ్లీ డెయిరీ ప్రాంగణంలోనే వ్యర్థ జలాలను వదిలేస్తోంది. దీంతో చుట్టుపక్కల నివాసం ఉంటున్న వారు దుర్వాసన భరించలేకపోతున్నారు. మరోవైపు ఆ వ్యర్థ జలాలు భూమిలోకి ఇంకడంతో బోర్లలో నీరు రంగు మారిపోయింది. అంతేకాక రాత్రివేళ దోమల బెడద కూడా ఎక్కువగా ఉండడంతో నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మదర్ డెయిరీ నుంచి వచ్చే వ్యర్థజలాలకు అడ్డుకట్ట వేయకుంటే భూగర్భ జలాలు కలుషితమై సమీప గ్రామాల్లోని ప్రజలను అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉందని పలువురు పర్యావరణ పరిరక్షకులు హెచ్చరిస్తున్నారు.



వ్యర్థ జలాలు బయటకు వెళ్లకుండా నిర్వాహకులు ప్రహరీ లోపల వేసిన రాళ్లు

కలుషితం..వ్యాధుల భయం

డెయిరీ నుంచి వెలువడే వ్యర్థనీరు భూమిలోకి ఇంకిపోతోంది. భూగర్భ జలాలు కలుషితమవుతున్నాయి. చుట్టుపక్కల బోరుబావుల్లో తాగునీరు కలుషితమవుతోంది. ఆ నీటినే తాగడం, స్నానాలు చేయడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని ప్రజలు వాపోతున్నారు.

పర్యావరణానికి పెనుముప్పు

డెయిరీ వ్యర్థ జలాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పును కలిగిస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఇవి గాలి, భూగర్భ జలాలు, నేలను కూడా కలుషితం చేస్తాయని చెబుతున్నారు. పరిశ్రమల్లో శుభ్రపరిచే ప్రక్రియల నుంచి వచ్చే రసాయనాలు, అధిక మొత్తంలో నూనెలు, గ్రీజులను కూడా కలిగి ఉండడంతో జీవఅధోకరణం చెంది ఆక్సిజన్ స్థాయిని తగ్గిస్తాయంటున్నారు. జిల్లా స్థాయి అధికారులు దీనిపై స్పందించి డెయిరీ ప్రాంగణంలో పరిశీలించి, నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నోటీసులిచ్చినా స్పందన ఏదీ..?

గతంలో బాలాజీ డెయిరీగా, ఆ తరువాత శ్రీజ డెయిరీగా, ఇప్పుడు మదర్ డెయిరీగా పాల పదార్థాల తయారీని కొనసాగిస్తున్న డెయిరీ నుంచి వ్యర్థాలు బయటకు వచ్చినపుడల్లా పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. అయినా సరే ఫ్యాక్టరీ యాజమాన్యానికి చీమకుట్టినట్టు కూడా అనిపించడం లేదనే వాదనలు అధికారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఇటీవల మురుగునీరు బయటకు వస్తుండడంతో ఎంపీడీఓ రామచంద్ర దృష్టికి తీసుకువెళ్లగా స్థానిక పంచాయతీ కార్యదర్శి ద్వారా ఫ్యాక్టరీ నిర్వాహకులకు నోటీసు ఇచ్చారు. అలాగే కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు సమాచారం అందించి, ఆ ఫ్యాక్టరీని పరిశీలించాలని లేఖ రాశారు. వ్యర్థ జలాలను డెయిరీ ప్రాంగణం నుంచి బయటకు రావడం లేదు కదా అని యాజమాన్యం ధీమాగా ఉంటోంది.

జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి మృతి



కలిమిలి రాజేశ్వరి(ఫైల్)

డక్కిలి: డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి గురువారం అనారోగ్యంతో బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమె మృత దేహాన్ని వెంటగిరి పట్టణంలోని కాలేజీమిట్టలో ఉన్న స్వగృహంలో ప్రజల సందర్శన కోసం గురువారం ఉంచి శుక్రవారం స్వగ్రామం అయిన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి తీసుకు వస్తారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని బంధువులు తెలిపారు. మృతురాలు రాజేశ్వరి వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సీనియర్ నాయకుడు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి. ఆమె 2013లో చాపలపల్లి పంచాయతీకి సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలుపొందారు. అనంతరం 2021సంవత్సరంలో జరిగిన జెడ్పీటీసీ ఎన్నికల్లో ఆమె డక్కిలి మండలం నుంచి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలుపొందారు. జెడ్పీటీసీ సభ్యురాలు రాజేశ్వరి మృతి చెందడంతో చాపలపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

వెంకటగిరికి చేరిన రాజేశ్వరి మృతదేహం

వెంకటగిరి రూరల్: డక్కిలి జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి మృతదేహం బుధవారం రాత్రి వెంకటగిరిలోని కలిమిలి నివాసానికి తీసుకొచ్చారు. నియోజకవర్గంలోని వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నేతలు రాజేశ్వరి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కలిమిలి రాంప్రసాద్‌రెడ్డికి పలువురి పరామర్శ..

కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సతీమణి రాజేశ్వరి మృతికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, తిరుపతి ఎంపీ డాక్టర్ ఎం గురుమూర్తి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డితోపాటు తిరుపతి, నెల్లూరు జిల్లాల పరిధిలోని ప్రముఖ రాజకీయనాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కలిమిలి రాంప్రసాద్‌రెడ్డిని ఫోన్‌లో పరామర్శించారు. కలిమిలి కుటుంబానికి దేవుని మనోధైర్యం కల్పించాలని ఆకాంక్షించారు.



కలిమిలి నివాసంలో రాజేశ్వరి పార్థివదేహం



రోదిస్తున్న రాజేశ్వరి బంధువులు

వరలక్ష్మీవ్రతానికి ఏర్పాట్లు పూర్తి

- భక్తులు తిలకించేందుకు ప్రత్యేక ఎల్‌ఈడీ స్క్రీన్‌లు



అమ్మవారి వరలక్ష్మీ వ్రతానికి సిద్ధమైన వేదిక

చంద్రగిరి: తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం నిర్వహణకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆస్థానమండపంలో వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు స్వర్ణరథంపై శ్రీ పద్మావతి అమ్మవారు నాలుగు మాడ వీధుల్లో విహరించనున్నారు. సుమారు 500 మందికి పైగా మహిళలు టికెట్లు కొనుగోలు చేసి ఆస్థాన మండపంలో నిర్వహించే వరలక్ష్మీ వ్రతంలో పాల్గొననున్నారు.

ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్క్రీన్‌ల ఏర్పాటు

వరలక్ష్మీ వ్రతాన్ని భక్తులు తిలకించేందుకు వీలుగా ప్రత్యేకంగా ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. ప్రసాదాలు, మజ్జిగ, తాగునీరు పంపిణీ చేయాలని ఇప్పటికే టీటీడీ యాజమాన్యం అధికారులను ఆదేశించింది. భక్తులకు పంపిణీ చేసేందుకు కుంకుమ ప్యాకెట్లు, కంకణాలు, గాజులు సిద్ధం చేసుకోవడంతోపాటు, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో భజన బృందాలను సైతం ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి ఆలయం, ఆస్థాన మండపం, ఇతర ప్రాంతాల్లో పుష్పాలంకరణ, విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. వరలక్ష్మీ వ్రతాన్ని ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారాలతో పాటు ఆస్థానమండపంలో భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలు ఏ ర్పాటు చేశారు.

750 గ్రాముల డ్రగ్స్ స్వాధీనం

చిల్లకూరు: గూడూరు పట్టణంలోని ఆస్పత్రి రోడ్డులో ఉన్న ఓ మెడికల్ షాపులో చేపట్టిన తనిఖీల్లో సుమారు 750 గ్రాముల డ్రగ్స్ ఉండగా గుర్తించి, స్వాధీనం చేసుకుని యజమానిని అదుపులోకి తీసుకున్నారు. పట్టణంలో డ్రగ్స్ దొరకడం దానికి యువతను ఆకర్షితులు చేసేలా షాపు యజమాని కొంత కాలంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. మత్తుకు బానిసలుగా మార్చేలా అతి తక్కువతో దొరికే పలు రకాల నిషేధిత మందులను, సాధారణ మందులతో పాటు తెప్పించి విక్రయించి, సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తుంది.

టీటీడీ నేత కబ్జాలో ఆలయ మాన్యం..!


- పంగూరు దళితవాడ వాసుల ఆందోళన
- రాజకీయ అందదండలతో టీటీపీ నేతకు పట్టా
- పట్టా రద్దు చేసి మాన్యాన్ని పరిరక్షించాలని దళితుల డిమాండ్



టీడీపీ నాయకుల స్వాధీనంలో ఉన్న ఆలయ మాన్యం వద్ద ఆందోళన చేస్తున్న పంగూరు దళితవాడవాసులు

ఏర్పేడు: మండలంలో పాగాలి గ్రామ సమీపంలోని రాములువారి ఆలయ మాన్యాన్ని టీటీడీ నేతలు కాజేసేందుకు యత్నిస్తున్నారని, దీనిని పరిరక్షించాలని కోరుతూ మండలంలోని పంగూరు దళితవాడ వాసులు ఆందోళన చేశారు. గురువారం ఆలయ మాన్యం వద్ద పంగూరు దళితవాడ వాసులు సుమారు 100మంది చేరుకుని ఆ భూమిలోని మొక్కలను జేసీబీతో తొలగించారు. వారు మాట్లాడుతూ, పేద దళితులమైన తమకు పాగాలి రెవెన్యూ పరిధిలో 1974లో అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ఎకరం చొప్పున వ్యవసాయ భూమిని పంపిణీ చేసి తామందరినీ సన్నకారు రైతులుగా మార్చారన్నారు. ఆ భూముల్లో కొంత మిగులు భూమి సర్వే నంబరు 205–4లో 2.09 ఎకరాలను తామంతా దేవుడి మాన్యంగా గ్రామ అవసరాల నిమిత్తం వినియోగించుకుంటున్నామన్నారు. అయితే పాగాలికి చెందిన టీడీపీ నాయకుడు సతీమణి మామండూరు మునెమ్మ పేరుతో ఈ భూమిలో అక్రమంగా పట్టాలు పొంది, ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసుకునేందుకు యత్నిస్తున్నారని, రాజకీయ అండతో భూస్వాములు పొందిన పట్టాను రద్దు చేసి తమ దేవుని మాన్యాన్ని పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై తహసీల్దార్ భార్గవి వివరణ కోరగా, తనకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, ఫిర్యాదు చేస్తే విచారణ చేసి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

కల్తీ..కల్తీ



హోటళ్లో తనిఖీ చేస్తున్న అధికారులు

తిరుపతి క్రైమ్: నగరంలో ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల శాఖ అధికారులు సంయుక్త గురువారం రెస్టారెంట్లపై మెరుపు దాడులు నిర్వహించారు. ఏపీ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ వీరపాండ్యన్ ఆదేశాల మేరకు.. జాయింట్ ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో 18 బృందాలుగా అధికారులు విడిపోయి, నగరంలోని 36 రెస్టారెంట్లు, బార్లను తనిఖీ చేశారు. ఇందులో 35 రెస్టారెంట్లలో శ్యాంపిల్లు సేకరించారు. హోటళ్లు, బార్లలో చాలాచోట్ల అసభ్యంగా కనిపించడంతో వారందరికీ నోటీసులు జారీచేశారు. నిల్వ ఉంచి పాడైపోయిన 26 కేజీల ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. 4 హోటళ్లపై కేసులు నమోదు చేసినట్టు అధికారులు తెలిపారు. అదేవిధంగా 14 రెస్టారెంట్లకు ఇంప్రూవ్మెంట్ నోటీసులు జారీచేశారు.

జాతీయ రహదారులు నిర్మించాలి

- పార్లమెంట్‌లో ఎంపీ మద్దిల గురుమూర్తి



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న తిరుపతి ఎంపీ మద్దిల

తిరుపతి మంగళం : పార్లమెంట్ నియోజకవర్గంలో జాతీయ రహదారులను నిర్మించాలని తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కోరారు. గురువారం పార్లమెంట్‌లో తిరుపతి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని రహదారుల పరిస్థితిని ఆయన కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. జాతీయ రహదారి–16పై సూళ్లూరుపేట వద్ద, జాతీయ రహదారి –716 పై కరకంబాడి వద్ద ఫ్లైఓవర్ల నిర్మాణం కోసం గతంలో ఇచ్చిన విజ్ఞప్తులపై కేంద్ర ప్రభుత్వం తీసుకొన్న చర్యల వివరాలు తెలపాలని కోరారు. శ్రీకాళహస్తి–తడ, గూడూరు–రాపూరు–రాజంపేట, ఊతుకోట–తడ రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా మార్చమని అభ్యర్థిస్తూ ప్రభుత్వానికి వినతులు అందాయా? అలా అయితే సాధ్యాసాధ్యాల అధ్యయన వివరాలు, బడ్జెట్ కేటాయింపుల వివరాలు తెలపాలన్నారు. ఇదే అంశాలపై గతంలో కేంద్ర మంత్రికి పలుమార్లు ఎంపీ విజ్ఞప్తి చేశారు. దీంతో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు జాతీయ రహదారుల శాఖా మంత్రి నితిన్ గడ్కరీ స్పందించారు. జాతీయ రహదారి–16పై సూళ్లూరుపేట షార్ సర్కిల్ వద్ద కి.మీ 81.050 వద్ద రోటరీ జంక్షన్, పాదచారుల కోసం కిమీ 80.970 వద్ద ఇప్పటికే అండర్‌పాస్‌లను అభివృద్ధి చేసినట్లు మంత్రి గడ్కరీ వెల్లడించారు. ఇవి తడ–నెల్లూరు వరకు ఉన్న జాతీయ రహదారి నాలుగు లైన్ల ప్రాజెక్టులో భాగంగా పూర్తయ్యాయని తెలిపారు. కరకంబాడి వద్ద చిన్నఒరంపాడు నుంచి రేణిగుంట జాతీయ రహదారి 716 నిర్మాణంలో భాగంగా రెండు ముఖ్యమైన అండర్ పాస్‌ల నిర్మాణం జరుగుతుందని మంత్రి తెలిపారు. కి.మీ 118.057 వద్ద కరకంబడి రైల్వే క్రాసింగ్ దగ్గర లైట్ వెహికల్ అండర్‌పాస్, కి.మీ 118.885 వద్ద కట్టపుట్టాలమ్మ ఆలయం సమీపంలో వెహికల్ అండర్‌పాస్ నిర్మించనున్నారని తెలిపారు. ఈ ప్రాజెక్టును 28 జనవరి 2025న కాంట్రాక్ట్ ద్వారా అప్పగించారన్నారు. ఈ పనులు మొదలయ్యాక తరువాత రెండేళ్లలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు.

రసాభాసగా ఓజిలి టీడీపీ అధ్యక్షుడి ఎన్నిక



టీడీపీ సమావేశంలో ఓజిలి మండల నాయకుల కుమ్ములాట



నాయుడుపేటలో ఎమ్మెల్యే విజయశ్రీ సమక్షంలో గొడవ పడుతున్న ఓజిలి మండల టీడీపీ నేతలు

- ఎమ్మెల్యే విజయశ్రీ ఎదుటే టీడీపీ నేతల కుమ్ములాట

నాయుడుపేటటౌన్: పట్టణంలో జరిగిన టీడీపీ మండల అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ రసాభసగా మారింది. పట్టణంలోని శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అధ్యక్షతన నియోజవర్గ పార్టీ పరిశీలకులు జెడ్ శివప్రసాద్ సారథ్యంలో టీడీపీ ఓజిలి అధ్యక్ష ఎన్నిక ప్రక్రియకు సంబంధించి మండల నాయకులు సమక్షంలో పార్టీ అధ్యక్షుల పేర్లను ప్రతిపాదించే ప్రక్రియ ప్రారంభించారు. కొద్ది సేపటికే ఎమ్మెల్యే, టీడీపీ పరిశీలకుల సమక్షంలోనే ఓజిలి మండలానికి చెందిన కొంత మంది నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి, ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ వాగ్వాదానికి దిగారు. ఓజిలి మండలంలో టీడీపీలో ఎప్పుటి నుంచో ఉంటున్న నాయకులకు కాకుండా కొత్తగా చేరిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నారని పెద్ద ఎత్తున వాగ్వాదానికి దిగారు. ఇప్పటి వరకు పార్టీ ఓజిలి మండల అధ్యక్షుడిగా ఉన్న విజయకుమార్ నాయుడుతో పాటు పలువురు నాయకులు ఎంత సర్ది చెబుతున్నా కొంత మంది నాయకులు ససేమీరా అంగీకరించకుండా చొక్కాలు పట్టుకుని, కుమ్మలాటకు దిగారు. చివరకు నాయుడుపేట అర్బన్, రూరల్ సీఐలు బాబి, సంగమేశ్వరరావు, ఎస్ఐలు ఆదిలక్ష్మి, నాగరాజు నాయకులను పక్కకు తీసుకెళ్లి వివాదం సద్దుమణిగేలా చర్యలు చేపట్టారు. అనంతరం ఓజిలి మండలంతోపాటు పెళ్లకూరు, నాయుడుపేట రూరల్, పట్టణ పార్టీ అధ్యక్షులకు సంబంధించి ఆశావాహుల పేర్లు నమోదు చేసుకున్నారు. ప్రతిపాదించిన పేర్లను పార్టీ అధిష్టానికి పంపి, అక్కడ నుంచి కమిటీ పేర్లు ప్రకటించం జరుగుతుందని ఎమ్మెల్యే విజయశ్రీ స్పష్టం చేశారు.

రోడ్డు మరమ్మతు చేయాలని నిరసన

- టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు
- రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ రాళ్లు నాటిన గ్రామస్తులు



రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఆలత్తూరు–కేటీ రోడ్డు అధ్వాన్నస్థితి చేరుకోవడంతో మరమ్మతులు చేయాలని గురువారం గ్రామస్తులు నిరసన తెలిపారు. కంకర తీసుకెళుతున్న టిప్పర్లను నిలిపి, రోడ్డుకు అడ్డంగా ఫెన్సింగ్ రాళ్లు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ రోడ్డు వెంబడి రాళ్ల క్రషర్లు, క్వారీలు ఉన్నాయని, క్రషర్లు, క్వారీల నుంచి టిప్పర్లు 50 టన్నులకుపైగా బరువున్న కంకర తీసుకుపోతున్నారని తెలిపారు. రహదారిలో రోజుకు 200పైగా లారీలు 50 టన్నుల ఓవర్‌లోడ్‌తో రోడ్డుపై తిరుగుతున్నాయని, వాటిని అరికట్టాల్సిన మైనింగ్ అధికారులు మామ్ముళ్ల మత్తులో జోగుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. సంక్రాంతికి రోడ్లుకు మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికిన కూటమి ప్రభుత్వం అసంగతి మరచిపోయిందని విమర్శించారు. రోడ్డు మరమ్మతు చేయాలని పలుసార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదన్నారు. సంబంధితశాఖ ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని, లేకుంటే కేటీ రోడ్డుపై రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. వేణుగోపాల్‌రెడ్డి, యనమలప్రసాద్‌పాల్, చిన్నికృష్ణ, లక్ష్మీనారాయణ, చెంచమ్మ, సుధీర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు వేగవంతం చేయాలి




అడ్మిషన్ల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఈఓ

తిరుపతి సిటీ: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీ అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలని డీఈఓ కేవీఎన్ కుమార్ ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా విద్యాశాఖాధికారి చాంబర్‌లో జిల్లాలోని ఓపెన్ స్కూల్ అధ్యయన కేంద్రాల సమన్వయకర్తలతో సమావేశమై అడ్మిషన్ల ప్రక్రియకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల ప్రక్రియలో అవినీతి, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్మీడియట్ తప్పిన విద్యార్థుల వివరాలను సేకరించి ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు కల్పించాలన్నారు. ఓపెన్ స్కూల్ సర్టిఫికెట్లు కూడా రెగ్యులర్ పాఠశాల సర్టిఫికెట్లతో సమానమైనన్న విషయాన్ని విద్యార్థులకు తెలియజేయాలని సూచించారు.


రైలులో కత్తితో హల్‌చల్

సూళ్లూరుపేట రూరల్: రైలులో ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేసిన ఘటన సూళ్లూరుపేట రైల్వేస్టేషన్‌లో చోటు చేసుకుంది. రైల్వే ఆర్పీఎఫ్ ఎస్ఐ రంజిత్‌సింగ్ సమాచారం మేరకు చెన్నై నుంచి భగత్‌కి కోటి సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ వెళ్తోంది. అందులో గుర్తు తెలియని ఓ వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. ఆర్పీఎఫ్ పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయితే అతనికి మతిస్థిమితం లేనట్టుగా అధికారులు గుర్తించారు.

దేశంలో వెంకటగిరి చేనేత చీరకు ప్రత్యేకత



మాట్లాడుతున్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



ర్యాలీని ప్రారంభిస్తున్న తిరుపతి జిల్లా కలెక్టర్

వెంకటగిరి రూరల్: వెంకటగిరి చేనేత చీరకు దేశంలో ఓ ప్రత్యేకత ఉందని తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని వెంకటగిరిలో గురువారం నిర్వహించిన జాతీయ చేనేత దినోత్సంలో వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతోకలసి పాల్గొన్నారు. తొలుత క్రాస్‌రోడ్డు వద్ద విద్యార్థులతో నిర్వహించిన ర్యాలీని కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణలు ప్రారంభించి ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పద్మశాలి కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన చేనేతల సదస్సులో తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ వెంకటగిరి చేనేత చీరలకు ఇతర రాష్ట్రాలతోపాటు దేశంలో అరుదైన గౌరవం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేసిన ఒక ప్రొడక్టర్ అవార్డుల్లో దేశంలోనే వెంకటగిరి చీరకు బంగారు పథకం అర్హత పొందిందన్నారు. కేంద్ర పరిశ్రమ శాఖ మంత్రి పీయూష్ గోషాల్ చేతుల మీదుగా తాను స్వయంగా బంగారు పథకం స్వీకరించినట్లు తెలిపారు. జిల్లాలో ఆరువేల పైగా చేనేత కుటుంబాలున్నాయని ముఖ్యంగా వెంకటగిరి, శ్రీకాళహస్తి, గూడూరు, నారాయణవనంలో ఉన్నారన్నారు. ఇందులో వెంకటగిరి పట్టు, జరీ, కాటన్, జందానీ చీరలు ప్రసిద్ధి చెందాయన్నారు. నారాయణవనంలో పెళ్లి పట్టుచీరలు, పుత్తూరులో టవల్స్, దోతీలు బాగా ప్రసిద్ధి చెందాయన్నారు. వెంకటగిరి పట్టణానికి చెందిన లక్కా శ్రీనివాసులు ప్రతిష్టాత్మకమైన సంతకబీర్ అవార్డుకు ఎంపిక అకావడం గర్వకారణంగా ఉందన్నారు. వెంకటగిరిలో 7 చేనేత సంఘాలు యాక్టివ్‌లో ఉండగా 2024–25 ఆర్థిక సంవత్సరంలో పీఎం ముద్ర యోజన పథకం ద్వారా 148 చేనేత కార్మికులకు రుణాలు ఇచ్చామన్నారు. వెంకటగిరిలో రూ. 1.52 కోట్లతో పోలేరమ్మ చేనేత క్లస్టర్, శ్రీకాహస్తిలో రూ. 90 లక్షలతో శ్రీకాళహస్తి స్మాల్ క్లస్టర్, నారాయణ వనంలో రూ. కోటితో నారాయణ వనం స్మాల్ క్లస్టర్స్ మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం చేనేతలతోకలసి రూ.60 లక్షల ముద్ర వీవర్స్ చెక్కును ఆవిష్కరించారు. హ్యాడ్‌లూమ్ ఏడీ రమేష్, ఎల్‌డీఎం గుంటూరు రవికుమార్ పాల్గొన్నారు.